జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 26-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 436 పేజీలు: 4 వెల: రూ.7

# డీఆర్‌డీఏలో కోట్లు మింగిన.. అవినీతి






*** పన్నెండు వేల జీతంతో కోట్లు కొల్లగొట్టిన వెంకటరమణ * చిన్న జీతం.. కోట్లు కాజేసిన దందా * బోగస్ బిల్లులు, బోగస్ కంపెనీలు, బోగస్ లావాదేవీలు * ఒక ఉద్యోగి వెనుక ఉన్న పెద్దల మౌనం ప్రశ్నార్థకం * ఆడిటు రిపోర్టులు తప్పులు చూపించాయి.. చర్యలు మాత్రం లేవు * ప్రాజెక్టు డైరెక్టర్ల అనుమతి లేకుండా సాధ్యమా? * కారు తిరగకపోయినా నెలకు ముప్పై ఐదు వేలు * ధాన్యం కేంద్రాల వరకు విస్తరించిన అవినీతి వల * మహిళా సంఘాల కమిషన్లు కూడా మాయమయ్యాయి * ఎనిమిది కోట్ల అవినీతి - నిశ్శబ్దంగా జిల్లా యంత్రాంగం * ప్రజల పన్నుల రూపాయలే అవినీతి బలి * చిన్న ఉద్యోగి - పెద్ద అవినీతి వ్యవస్థ * ప్రజల డిమాండ్ - వెంటనే ఉన్నతస్థాయి విచారణ**


**శ్రీకాకుళం, ఆగస్టు 25 (వార్త):** శ్రీకాకుళం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో ఒక చిన్న ఉద్యోగి సూత్రధారిగా మారి, ప్రభుత్వ నిధులను దోచుకుంటూ కోట్లు కాజేశాడని ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. నెలకు కేవలం పన్నెండు వేల రూపాయల జీతం పొందుతున్న కొత్తపల్లి వెంకటరమణ గత ఐదేళ్లలో సుమారు ఎనిమిది కోట్లు అవినీతి ద్వారా సంపాదించాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



## అవినీతికి బోగస్ సంస్థల వల..

వెంకటరమణ వివిధ పేర్లతో తప్పుడు సంస్థలు నమోదు చేసి, వాటి ద్వారా తప్పుడు బిల్లులు వేసి డబ్బులు వసూలు చేస్తున్నాడని సమాచారం. శ్రీరామ అండ్ కో, శిరిడి సాయిబాబా ఏజెన్సీ, శ్రీరామ వెంకట సాయి ఏజెన్సీ.. ఇలా సంస్థల పేర్లతో వాస్తవానికి పనులు జరగకపోయినా, బిల్లులు క్లియర్ చేసి ప్రభుత్వ నిధులను తన ఖాతాలకు మళ్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగం అప్పటి ప్రాజెక్టు డైరెక్టర్లకు అందేలా పంచుకునే పద్ధతి నెలకొల్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.





## అధికారుల మౌనం..

గతంలో ఈ సంస్థలో పనిచేసిన ప్రాజెక్టు డైరెక్టర్లు జిసిసి కిషోర్ కుమార్, బగాది శాంతిశ్రీ, ప్రస్తుత కిరణ్‌కుమార్ హయాంలో కూడా అవినీతి ఆగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెర్ప్ సంస్థ అధికారి స్థాయిలో విచారణ జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలు రేకెత్తిస్తోంది. ఆడిటు నివేదికల్లో కూడా తప్పులు బయటపడ్డా జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం ప్రజల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది.

## కాంట్రాక్టుల దందా

ప్రాజెక్టు డైరెక్టర్ ప్రయాణాల కోసం తన సొంత కారునే అద్దెకు ఇచ్చి నెలకు ముప్పై ఐదు వేల రూపాయల బిల్లు వేస్తున్నాడని సమాచారం. కారు అసలు తిరగకపోయినా బిల్లులు వేసి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఎచ్చెర్లలో శిక్షణా కార్యక్రమాల పేరుతో కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేసి, తప్పుడు బిల్లుల ద్వారా నిధులు డ్రా చేసినట్లు వివరాలు బయటికొచ్చాయి.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూనిక మిషన్ల నుండి గోనె సంచుల వరకూ తప్పుడు బిల్లులు వేసి నిధులను లాక్కున్నారని ఆరోపణలు ఉన్నాయి. మహిళా సంఘాలకు లభించాల్సిన కమిషన్లను కూడా వెంకటరమణ, అతని భార్య, సహాయకుడు రవికుమార్ ఖాతాలకు మళ్లించినట్లు బయటపడింది.

## ఆడిటు నివేదికలిచ్చినా.. చర్యలు లేవు

ఆడిటు నివేదికల్లో స్పష్టంగా తప్పులు నిర్ధారించినా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం జిల్లా అధికారులపై తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తోంది. "ఒక చిన్న ఉద్యోగి ఇంత పెద్ద దందా ఒక్కడిగా చేయగలడా? వెనుక ఉన్న పెద్దలు ఎవరు?" అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

## ప్రజల డిమాండ్

ప్రజల పన్నుల రూపంలో వచ్చిన డబ్బులు ఇలాగే దోచుకుంటే గ్రామీణాభివృద్ధి అనే లక్ష్యం ఎలా నెరవేరుతుంది? వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపి, వెంకటరమణను విధుల నుండి తప్పించి, బోగస్ ఖాతాలన్నింటినీ తిరగదిద్దాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కళ్లెదుటే.. ఘోరం





*** ఇంటికి వెళ్తున్న తరుణంలో కబళించిన మృత్యువు * హైవేపై లారీ ఢీకొని రైతు మృతి * కుమారుడికికు తీవ్ర గాయాలు * కుప్పకూలిన తల్లి * కన్నీరుమున్నీరైన కుటుంబీకులు * విషాదంలో వీరగున్నమ్మపురం**

**మందస, ఆగస్టు 25(వార్త):** ఉదయమంతా కష్టపడి.. సాయంత్రమయ్యే సరికి ఇంటికి వెళ్లిపోదామనుకున్న తరుణంలో మృత్యువు ఓ రైతును కబలించింది. మరొక్క నిముషం దాటి ఉంటే.. జాతీయ రహదారి నుంచి కిందికి వచ్చి, ప్రమాదం నుంచి తప్పించుకునేవారు. కానీ, విధి బలీయమైంది. ఎవరిని, ఏక్షణాన ఏం చేస్తుందో తెలియని పరిస్థితి. కళ్లెదుటే భర్త మృతి చెందడం, కుమారుడు తీవ్రగాయాలపాలవ్వడంతో ఆ తల్లి అక్కడే కుప్పకూలింది. వివరాలు ఇలా ఉన్నాయి.

మందస మండలంలోని వీరగున్నమ్మపురం గ్రామానికి చెందిన సాసుమాన మోహనరావు (63) భార్య కాంతమ్మ, కుమారుడు నరసింహాతో కలసి గాబు (కలుపు) తీతకు బాలిగాం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న పొలానికి వెళ్లారు. రోజంతా శ్రమించి, సాయంత్రం అయ్యేసరికి ఇంటికి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు. తమతో పాటు తీసుకెళ్లిన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమవ్వడానికి నరసింహా వాహనం తీశాడు. మోహనరావు వెనుక ఎక్కాడు. తల్లిని కూడా రమ్మనగా ఆమె వస్తున్న తరుణంలో జాతీయ రహదారిపై అతి వేగంతో వచ్చిన గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొంది. ప్రమాదంలో మోహనరావు వాహనంపై నుంచి ఎగిరిపడి, తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు నరసింహా తీవ్రగాయాలు కాగా, కదల్లేని పరిస్థితిలో అచేతనుడుగా ఉండిపోయాడు. క్షణాల్లోనే తన కళ్ల ముందే కాంతమ్మ భర్త మోహనరావు మరణించగా, కుమారుడు తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా.. ఆమె కూడా కుప్పకూలింది. అక్కడ ఉన్న కొంతమంది అంబులెన్స్‌కు సమాచారం అందివ్వగా.. హుటాహుటిన సిబ్బంది చేరుకుని, ప్రాథమిక చికిత్స అందజేశారు. మోహనరావు మృతదేహాన్ని హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమత్తం తరలించారు. తీవ్ర గాయాలతో బాధ పడుతున్న నరసింహాను మెరుగైన చికిత్సకై శ్రీకాకుళం తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# ఏకధాటిగా వర్షం

*** అల్పపీడనంతో జిల్లా అంతటా వానలు * రెండు రోజులు పాటు భారీ వర్షం అంటున్న అధికారులు * జలమయమైన ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన రహదారులు * వినాయక చవితికి భారీ దెబ్బ**

**శ్రీకాకుళం, ఆగస్టు 25(వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ఆదివారం రాత్రి ప్రారంభమైన వర్షం మరో రెండు రోజులు పాటు ఉంటుందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. సోమవారం ఏకధాటిగా కురిసిన వర్షానికి శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. కాంప్లెక్స్‌లో అడుగు మీద నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులతో పాటు ఆర్టీసీ సిబ్బంది సైతం ఇబ్బందులు పడ్డారు. అలాగే నగరంలోని డ్రైనేజీలు పొంగి పొర్లడంతో ప్రధాన రహదారులు పిల్ల కాలువల మాదిరిగా తయార య్యాయి. ఈనెల 27న వినాయక చవితి ఉండడంతో వ్యాపారులు లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసి తీసుకువచ్చిన గణనథుల ప్రతిమల విక్రయానికి ఈసారి గట్టిదెబ్బ పడింది. పూజా సామగ్రి, పూలు, పండ్లు విక్రయించే వ్యాపారులకు ఈ వర్షం నష్టాని తెచ్చిపెట్టేలా తయారైంది. గణపతి మండపాలు వేసేవారు సైతం ఇబ్బందులు పడుతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి



**వీరఘట్టం, ఆగస్టు 25(వార్త):** వినాయక ఉత్సవాలను నిర్వహించే కమిటీలు తప్పని సరిగా పోలీస్ శాఖ నిబంధనలు పాటించాలని ఎస్ఐ జి.కళాధర్ స్పష్టం చేశారు. సోమ వారం ఆయన తూడి, చిదిమి తదితర గ్రామాల్లో పర్యటించి గణేష్ ఉత్సవాల కమిటీ సభ్యులతో సమావేశమై, వారికి నిబంధనలను విపులంగా వివరించారు. గణేష్ ఉత్సవా లను ఎటువంటి తగాదాలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన సూచిం చారు. కమిటీలు ప్రజలకు ఇబ్బందులు లేకుండా వినాయక ఉత్సవాలను నిర్వహించాలని ఆయన కోరారు.

# దివ్యాంగుల పెన్షన్ల తొలగింపునకు కుట్ర

**- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజం**

**-జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**



**నరసన్నపేట, ఆగస్టు 25 (వార్త):** దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదల పెన్షన్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. సోమవారం ఆయన జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు వేల మందికి పెన్షన్ దూరం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ హామీని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు వస్తున్న పెన్షన్లను కూడా నిలిపి వేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పదేళ్లుగా పెన్షన్ పొందుతున్న వృద్ధులు, వికలాంగులు ఒక్క రోజులోనే అనర్హులుగా ముద్ర వేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వెంటనే పెన్షన్ల తొలగింపు నిర్ణయాన్ని పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, టెక్కలి, ఆమదాలవలస సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షులు వెలమల బాలరాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రౌతు శంకరరావు, కోటబొమ్మాళి జడ్పీటీసీ దుబ్బ వెంకటరమణ, ఎంపీపీ రోణంకి ఉమ మల్లయ్య, మండల సంపతిరావు, హేమసుందరరాజు, వైస్ ఎంపీపీ దుక్క రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వెంకన్న ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

**నరసన్నపేట, ఆగస్టు 25(వార్త):** నరసన్నపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలితో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ఆయన స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు జరిపి, పాలకమండలి సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులు నిరంతరం దేవస్థానం అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాలకమండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జన సైనికులకి అండగా ఉంటాం



**వీరఘట్టం, ఆగస్టు 25(వార్త):** వీరఘట్టంలోని బీసీ కాలనీకి చెందిన గుడ్డాల రుషికుమార్ ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి పట్టణ నాయకులు ఆదివారం ఆయనను పరామర్శించారు. అన్ని విధా లుగా అండగా ఉంటామని అభయమిచ్చార. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్య క్షుడు జామి లక్ష్మీనారాయణ, పట్టణ శాఖ నాయకులు బళ్ల హరిబాబు, వైశ్య సంఘం నాయకులు తూముల రమేష్, చుక్కా శ్రీను, పట్టణ జనసేన నాయకులు సరిపల్లి అచ్యుతరావు, కర్నేన సాయి, పవన్‌కళ్యాణ్, ఆనంద్, వినోద్, రాజేష్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు

## యోషితకు మెడికల్ సీటుపై హర్షం



**సంతబొమ్మాళి, ఆగస్టు 25(వార్త):** బోరుభద్ర గ్రామానికి చెందిన వజ్జ యోషిత నీట్‌లో విజయం సాధించారు. దీంతో ఎంబీబీఎస్‌లో వెంకటేశ్వర మెడికల్ కాలేజ్‌లో సీటు పొంది సత్తా చాటారు. ఆమెకు కన్వీనర్ కోటాలో మెడికల్ సీటు రావడంపై తల్లిదండ్రులు నరస య్య, నీరజ, స్నేహితులు హర్షం వ్యక్తంచేశారు. శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

**-ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్రావు**





**వీరఘట్టం, ఆగస్టు 25(వార్త):** ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరము పోరాటమే తమ సంఘం ధ్యేయమని, ఆ దిశలోనే ఉద్యమిస్తామని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్ను వెంకట్రావు అన్నారు. ఈమేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల బదిలీ అయ్యి కొత్త పాఠశాలల్లో చేరని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో డీఎస్సీ2025 అభ్యర్థులను నియమించాలని, మిగులు ఉపాధ్యాయులను గుర్తించి వారిని శాశ్వత ప్రాతిపదికన కొత్త పాఠశాలలో నియమించాలని వారు కోరారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛను అమలు చేయాలన్నారు. పీఆర్సీని ప్రకటించాలని, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలను తక్షణమే చెల్లించి ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. పరీక్షలకు బుక్‌లెట్ విధానం విపరీతమైన పని భారం పెరిగిందని, దీనిపై పునరాలోచించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా అంపోలు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వన్నల శ్యామసుందర రావును ఎన్నికైనట్లు వారు తెలిపారు.



## యోగి వేమన జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో యోగి వేమన జయంతి వేడుకలు స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూల మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, యశోద, పార్వతి, ప్రమీల, సరోజినీ, దేవి, రవి, శిరీష ఎస్‌పీఎల్స్ జి.హారిక, యువశ్రీ, ఇంటరాక్ట్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియా, సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ మాలాధారణ



**వీరఘట్టం, ఆగస్టు 25(వార్త):** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వీరఘట్టంలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో కాశీ విశ్వేశ్వర పంచాయుధుల ఆలయం సన్నిధిలో సోమవారం ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో పలువురు భక్తు లకు గణేష్ మాలాధారణను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. వీరు 13 రోజుల పాటు దీక్ష చేపట్టి సెప్టెంబరు ఆరున మాల విసర్జిస్తారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖా అర్చకసంఘం అధ్య క్షులు లింగరాజప్రసాదరథో, ఆలయప్రధాన అర్చకులు గంగాధరమహాపాత్రో, ముఖ్య అర్చకులు సుధీర్ పాణి, గురుస్వామి బ్రహ్మశ్రీ పాటిమీద భరతకుమారాచారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కార్యకర్తలకే ఎరువులు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త):** ఇచ్ఛాపురం మండలంలో తెలుగుదేశం కార్యకర్తలకే ఎరువులు సరఫరా చేస్తున్నారని ఎంపీపీ బోర పుష్ప ఆరోపించారు. 12 వందల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, రైతులు అందరికీ ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం వ్యవసాయ అధికారి అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారింగి మోహనరావు, లోపింటి దీనబంధురెడ్డి, త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానభారతిలో అత్యుత్తమ ప్రమాణాలతో విద్య




**ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త):** జ్ఞానభారతి పాఠశాలలో అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు ఉద్యోగ అవ కాశాలు కూడా అందిస్తున్నామని జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి సీఈవో జోహార్ ఖాన్ అన్నారు. సోమవారం సాయంత్రం పాఠశాలలో 6,7,8 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదవ తరగతి నుంచే కార్టే బ్లాంచ్ మైక్రో సాఫ్ట్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో 12వ తరగతి 70%తో పాసైన విద్యార్థులకు ప్రముఖ ఐటీ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నామన్నారు. పోటీ ప్రపంచానికి దీటుగా కృత్రిమ మేథలో సైతం విద్యార్థు లకు మైక్రోసాఫ్ట్ కో పైలెట్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో మాట్లాడి పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల తల్లిదండ్రుల ముఖా ముఖి నిర్వహించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐబి పండ, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిణి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్ పాల్గొన్నార్ణు.

## ఉత్సవాలలో ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో ప్రజలకు ఇబ్బందులు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ రావు చెప్పారు. టి.బరంపురంలో అవగాహన కల్పించారు. సంబంధిత దత్తత కానిస్టేబుల్‌ల సహాయంతో వినాయక వెబ్సైట్ లింక్‌లో అనుమతులు పొందాలని కోరారు.

## కొలిగాంలో విద్యార్థులకు క్రీడా శిక్షణ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త):** స్పోర్ట్స్ డే సందర్భంగా కొలిగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు లాంగ్ జంప్ ప్రాక్టీసు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ పూండి, బెజ్జిపల్లి ధర్మరాజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నరేంద్ర నాథ్ పట్నాయక్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పుండి, ధర్మరాజు, జ్యోతి, రేణుకా,అమిత, స్వప్న, దేవకీ, వాణి, భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, పాపరావు, శ్రీనివాసరావు, చంద్రవదన, ఉప్పాడ పాపారావ్, కేశవ, బర్ష నాయక్ పల్గున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీముఖలింగేశ్వర ఆలయాన్ని కాపాడాలి

**జలుమూరు, ఆగస్టు 25(వార్త):** దక్షిణ కాశీగా శ్రీముఖలింగేశ్వర ఆలయం పేరుగాంచింది. ఈ దేవాలయంలోని శిల్ప సంపదను కాపాడాలని మాన్యుమెంట్ అథారిటీ చైర్మన్‌ను అర్చకుడు రాజశేఖర్.. ఢిల్లీలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయంలోని పురాతన శాసనాలు, కట్టడాలు పెచ్చులూడి శిథిలమవుతున్నాయని వివరించారు. ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించారని రాజశేఖర్ తెలిపారు.





## ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయండి

**జలుమూరు, ఆగస్టు 25(వార్త):** జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని పాలకవర్గానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. సోమవారం ఆయన చైర్మన్, డైరెక్టర్లతో జరిగిన సాధారణ సభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మార్కెట్ కమిటీ నిధులతో మీటింగ్ హాల్, రహదారులు, ప్రహరీ, గొడౌన్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు అవగాహన



**రణస్థలం, ఆగస్టు 25(వార్త):**కమ్యూనిటీ ఇంటరాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం జీరుపాలెం మత్స్యకారులకు కళింగపట్నం సీఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ హరికృష్ణరావు.. వేటకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లైఫ్‌జాకెట్స్, డాట్ పరికరాలు వినియోగంపై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, మందుగుండు సామగ్రి, మాదకద్రవ్యాల రవాణా, సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమాచారం 1093, 9392914712కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇండియన్ కోస్ట్ గార్డ్, ఫిషరీస్, రెవెన్యూ శాఖల అధికారులు, ఎఫ్‌డీవో, సాగర్‌మిత్రలు, ఫిషరీ అసిస్టెంట్, జీరుపాలెం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## దివ్యాంగ పింఛన్లపై వైకాపా దుష్ప్రచారం



**నరసన్నపేట, ఆగస్టు 25(వార్త):** దివ్యాంగుల పింఛన్లపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని టీడీపీ జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు గురువిల్లి వెంకటరమణ, ఊన సాయి అన్నారు. సోమవారం వారు నరసన్నపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3000ల పింఛన్‌ను రూ.6000లకు పెంచిందన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తప్పుడు సదరం ధ్రువపత్రాలతో ఆ కార్యకర్తలు పెన్షన్ పొందారని, దీంతో దివ్యాంగులకు అనేక నష్టం జరుగుతోందన్నారు. సదరం రీవెరిఫికేషన్ కోసం కేవలం నోటీసులు మాత్రమే ప్రభుత్వం అందించిందని, వైకాపా నాయకులు దీనిని తప్పుడుగా ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నోటీసుల అందుకున్న దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొంది నిజమైన దివ్యాంగులైతే ప్రభుత్వ పెన్షన్ పొందవచ్చని సూచించారు.

## జడ్పీ పాఠశాలను సందర్శించిన డైట్ అధ్యాపకుడు



**జలుమూరు, ఆగస్టు 25 (వార్త):** చల్లవానిపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను డైట్ అధ్యాపకుడు బి.శరత్ బాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా ర్థుల ఎన్‌రోల్‌మెంట్, రోజూవారీ హాజరు, అకడమిక్ సిలబస్‌ను పరిశీ లించారు. పాఠశాలలో అన్ని విషయాలు పరిశీలించి సంతృప్తి చెందారు. కార్యక్ర మంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యోగా పోటీలో శ్రీకాంత్ ప్రతిభ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 25 (వార్త):** తాడేపల్లి గూడెం ప్రత్తి పాడు సరస్వతి విద్యాలయంలో ఈ నెల 21 నుండి 25 వరకు జరిగిన 6వరాష్ట్ర స్థాయి యోగసన ఛాంపియన్స్ షిప్ పోటీలలో శ్రీకాంత్ మహంతి సంప్రదాయ ఆసనం లో మొదటి బహుమతి, ట్విస్టింగ్ ఆసనంలో మొదటి బహుమతి గెలుసుకున్నారు. జూనియర్ విభాగంలో పాలేపు సాయి జగదీశ్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు.

## ఉద్దానంలో వికసించిన 'మానస'

**మందస, ఆగస్టు 25(వార్త):**ఉద్దానంలో 'మానస' పరిమళించింది. ఎంబీబీఎస్ ఫేజ్-1లో సీటు సాధించింది. టాప్ త్రీ కళాశాలల్లో ఒకటైన రంగరాయ మెడికల్ కళాశాలలో డాక్టరవ్వడానికి సిద్ధమవుతోంది. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు పంచాయతీ, చిన్నదున్నవూరు గ్రామానికి చెందిన లబ్బ వెంకటేష్, తులసమ్మ సామాన్య కుటుంబం. మానస తల్లి గృహిణి కాగా, తండ్రి ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తు న్నారు. నీట్ ఎంట్రన్స్‌లో ఆల్ ఇండియా 40245 ర్యాంకు, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో వెయ్యిలోపు ర్యాంకు సాధించి, ఎంబీబీఎస్‌కు ఎంపికయ్యింది.

## పింఛన్లను పునరుద్ధరించాలి

**హిరమండలం, ఆగస్టు 25 (వార్త):** తొలగించిన వికలాంగుల పిన్షన్లను పునరుద్ధంచాలని సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో శ్రీకాకుళం జిల్లా వికలాంగుల అధ్యక్షుడు వెలమల బాలరాజుతో పాటు పలువురు వికలాంగులు వినతి పత్రం అందజేశారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలి మృతి

**-ప్రమాద ఘటన చూసి, కుప్పకూలి తోటి యాచకుడి మృతి**

**-ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ క్లూస్ టీం**





**జి.సిగడాం, ఆగస్టు 25(వార్త):** వాంద్రంగి పంచాయతీ చీడిపేట కూడలి వద్ద సోమవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు బలగ భాగ్యం (50) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదాన్ని చూసి తట్టుకోలేక తోటి యాచకుడు కూడా కుప్పకూలి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన వీరిద్దరూ కొన్నాళ్ల నుంచి చీడిపేట పాత బస్టాండ్ వద్ద గల ఆలయం వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. రాత్రి వేళల్లో అక్కడికి సమీపంలో ఉంటూ కాలం గడుపుతున్నారు. వేకువజామున సుమారు 3:30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జి.సిగడాం ఎస్.ఐ వై.మదుసూదనరావు సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీకాకుళం కూస్ టీం కూడా పరిశీలించింది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వడగ గౌరీశంకరరావు, వీఆర్వో శివన్నారాయణ ఉన్నారు.

# రాజేశ్వరి డిప్యూటేషన్ తక్షణమే రద్దు చేయాలి

**-పట్టులోగాం ఆశ్రమ పాఠశాలకు తిరిగి బదిలీ చేయాలి**

**-కులం పేరుతో విద్యార్థులను దూషించిన ఉపాధ్యాయినిలను సస్పెండ్ చేయాలి**

**-డీడీ, ఏటీడబ్ల్యూఓ దర్యాప్తు చేసిన నివేదికలు బహిర్గతం చేయాలి**

**-దళిత, ఆదివాసీ ప్రజా సంఘాల నేతల డిమాండ్**

**మందస, ఆగస్టు 25(వార్త):** పట్టులోగాం గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు చింతాడ రాజేశ్వరి డిప్యూటేషన్ తక్షణమే రద్దు చేయాలని దళిత, ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం వారు సీతంపేట ప్రజాదర్బార్‌లో ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను కుల దూషణ చేసిన ఉపాధ్యాయినిలపై చర్యలు తీసుకోమని



ఉద్యమిస్తే, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాజేశ్వరిపై చర్యలు తీసుకోవడం తగదన్నారు. టీచర్స్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, రాజేశ్వరిని పట్టులోగాంలోనే కొనసాగించాలని, ఈ ఘటనలపై డీడీ, ఏటీడబ్ల్యూఓ విచారణ నివేదికలను తక్షణమే బహిర్గతం చేయాలని కోరారు. వారం రోజుల్లో సమస్య పరిష్కంచకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఐటీడీఏ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని, వేరే అధికారితో దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సవర లక్ష్మీనారాయణ, మందస మండల గిరిజన సంఘం జిల్లా నాయకులు సవర ధర్మారావు, మందస ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఇప్పిలి, చంద్రశేఖర్, బి.మురళి, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, దళిత సంఘాల జేఏసీ జిల్లా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, డీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకుడు రాకోటి రాంబాబు పాల్గొన్నారు.

# లక్ష్మీనర్సుపేట మండలాన్ని శ్రీకాకుళంకు మార్చాలి

**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 25(వార్త):** లక్ష్మీనర్సుపేట మండలాన్ని టెక్కలి నుంచి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు మార్చి, శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలని ఆ మండల నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం వారు సమావేశమై పంచాయతీ తరఫున తీర్మానం చేశారు. లక్ష్మీనర్సుపేట గతంలో శ్రీకాకుళం డివిజన్‌లో ఉండేదని, దీంతో రెవెన్యూ అవసరాలకు అధికారులను కలవడానికి తమకు ఎంతో సులభంగా ఉండేదన్నారు. కానీ సదరు డివిజన్ మార్పులో ప్రజల అభిప్రాయాలను, ఇష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గత ప్రభుత్వం వారు తీసుకున్న నిర్ణయంతో తయకు కష్టా మొదలయ్యాయన్నారు. టెక్కలికి సుమారుగా 60 కిలోమీటర్ల దూరం ప్రయాణానికి మూడేళ్ల నుంచి మండలంలోని అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు



స్పందించి తమ వినతి మేరకు లక్ష్మీనర్సుపేట మండలాన్ని టెక్కలి డివిజన్ నుంచి శ్రీకాకుళం డివిజన్‌కు మార్చాలని, శ్రీకాకుళం జిల్లాలో కొనసాగించాలని కోరారు.

# ఘనంగా వైకాపా నేత కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలు



**మందస, ఆగస్టు 25(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం వైభవంగా మందసలో జరిగాయి. హేపీ బర్త్‌డే టు యూ కిషోర్.. అంటూ స్నేహితులు, అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య ఆయన కేక్ చేశారు. అనంతరం అతిథులకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కిషోర్‌కుమార్ పార్టీకి అందిస్తున్న సేవలు కొనియాడారు. ఆయురారోగ్యాలతో, ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు అత్యంత సన్నిహితునిగా.. మందస మండలంలో కిషోర్ పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో వైకాపా బలోపేతమై.. మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మందస సర్పంచ్ ప్రతినిధి చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, వీరగున్నమ్మపురం సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ, మందస పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, పితాతొళ్లి మాజీ సర్పంచ్ బాడ జగన్నాయకులు, కొయిల ఈశ్వరరావు, బీఎస్ పురం మాజీ ఎంపీటీసీ మురపాల నారాయణరావు, సిద్ధిగాం సర్పంచ్ గున్న రమణ, మందస ఎంపీటీసీ ప్రతినిధి దువ్వ జగదీష్, తలగాన హరికృష్ణ, తమిరియా శోభన్‌బాబు, సుగ్గు కోటి, దువ్వ నారాయణరావు, తలగాన యర్రయ్య (వెంకీ), మట్ట బెనర్జీ, బంగారు చిన్న, గుసిరి రమేష్, బైనపల్లి వెంకటేశ్, బి.బల్లు, ఎస్.సంతోష్, కొల్ల గణేశ్, కొంటేన ప్రసాద్, డొక్కరి పాపారావు, సురంగి శ్యాం, గజ్జి భాస్కరరావు, పొందర డొంబురు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

## ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి : విజిలెన్స్ సీఐ



**జలుమూరు, ఆగస్టు 25(వార్త):** చల్లవానిపేట, జలుమూరులోని శ్రీలక్ష్మీ ట్రేడర్స్, కోరమండల్ ఫెర్టిలైజర్ ఎల్టిడీ షాపుల్లో అకస్మాత్తుగా ఆదివారం విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్టర్ సీహెచ్ ఎర్రంనాయుడు, ఏడీఏ ఎల్‌వీ మధు తనిఖీలు నిర్వహించారు. షాపులను విజిట్ చేసి, స్టాక్ వెరిఫికేషన్‌ను చేసే రికార్డులను పరిశీలించారు. తమ ఇష్టారాజ్యం ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ హెచ్చరించారు. ప్రతి రైతుకు ఒకటి రెండు బస్తాల కంటే ఎక్కువ ఇవ్వద్దని తెలిపారు. ఎరువులను ఎమ్మార్పీకే రైతులకు అమ్మాలన్నారు. కార్యక్రమంలో ఏవో కింజరాపు రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో సరుకుల పంపిణీలో పారదర్శకత




**జలుమూరు, ఆగస్టు 25(వార్త):** చల్లవానిపేట సచివాలయ ఆవరణలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కొత్త పథకాలను తీసుకొచ్చి అమలు చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా మరింత పారదర్శకతతో, వేగవంతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, జడ్పీటీసీ ప్రతినిధి, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీవో, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



**జి.సిగడాం, ఆగస్టు 25(వార్త):** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎస్ఈఆర్) అన్నారు. సోమవారం మెట్టవలసలో నిర్వహించిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాల పత్రాలు రాజముద్రతో అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు, సర్పంచ్ కామోజలు ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర లక్ష్మి, కామోజుల సీతారాం, జనసేన నాయకుడు పైల శివకుమార్. గణేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, బూరాడ వెంకటరమణ, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, కురిరెల్ల బుజ్జి, తాలాబత్తు పైడిరాజు, గొల్లాజీ, కూనుబిల్లి కూర్మారావు, బెవర బాలకృష్ణ, మహాదాస్యం చిన్నారావు, పలిశెట్టి సూర్యానారాయణ, డబ్బాడ అదినారాయణ, మజ్జి కన్నంనాయుడు, డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్, పైల బాబ్లీనా యుడు, తహసీల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏపీవో చోళ్ల సత్యనారా యణ, పలు శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త):** క్యూఅర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు ఇచ్ఛాపురం మండలంలో 26247 కార్డులు 49 డిపోల్లో పంపిణీ చేసినట్లు డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి తెలిపారు. సోమవారం ఆ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య,దక్కాత ఢిల్లీ రావు, లోపింటి పద్మనాభం, కొండ శంకర్, నందికి జానీ, ఆసి లీలారాణి, శాసన శేఖర్, కాళ్ల దిలీప్, దాసరి శేఖర్, రంగాల శ్రీను, కాయ శ్రీను, సాలీనా ఢిల్లీ, గాలి పాపారావు, నీలాపు వెంకట రెడ్డి, కొర్రాయి ధర్మరాజు, గణపతి, రామారావు, దొరబాబు, కలియ గౌడో, శేఖర్, పీతాంబర్ రెడ్డి, రూరల్, టౌన్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. 22 వ వార్డు రేషన్ డిపోలో స్మార్ట్ రేషన్ కార్డులను కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి రాజు, సచివాలయ సిబ్బంది బాగా స్వాతి, డీలర్ కాళ్ల చక్రవర్తి పాల్గొన్నారు.







**పలాస, ఆగస్టు 25(వార్త):** నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సోమవారం రెంటికోట గ్రామంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలు లేకుండా, లబ్ధిదారులకు సమయానుసారం సరుకులు అందేలా ఈ స్మార్ట్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. కూటమి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు. తీసుకొచ్చామని, ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు చేసి చూపిస్తున్నామన్నారు. ఈ కొత్త కార్డుల ద్వారా లబ్ధిదారులు రాష్ట్రంలోని ఏ చౌకధరల దుకాణంలోనైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కలుగుతుందని స్పష్టం చేశారు. కార్డులో పేర్ల మార్పులు, చేర్పుల కోసం స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పలాస తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఈ కార్డులతో పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పలాస ఏఎంసీ చైర్మన్ వంకల కూర్మారావు, పిరుకట్ల విఠల్‌రావు, రెంటికోట మాజీ ఎంపీటీసీ, సీనియర్ టీడీపీ నాయకులు హెూరియా మోహన్ రావు, సచివాలయ కార్యదర్శి సద్గుణ బాబు, వీఆర్వో అన్ను ప్రసాద్, కద్దాల కృష్ణారావు, బుగత రమణ, హెూరియా నిరకర్, ఆలేటి రాజు, హెూరియా చాక్రో, శ్రీధర్ నిరంజన్, రేషన్ డీలర్లు కర్రియ మంత్ర, హెూరియా మణి, కద్దాల బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జిల్లా స్థాయి అండర్ -17 ఫెన్సింగ్ పోటీలు

**శ్రీకాకుళం స్పోర్ట్స్ న్యూస్, ఆగస్టు 25(వార్త):** శ్రీకాకుళంలోని శ్రీ ఫంక్షన్‌హాల్ వేదికగా జిల్లా స్థాయి ఫెన్సింగ్ అండర్ -17 పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు నిర్వహించిన ఈ పోటల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఫెన్సింగ్ పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా )ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే జిల్లా జట్టుకి మేనేజర్‌గా రాహుల్, కోచ్‌గా హేమంత్ వ్యవ హరిస్తారన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫెన్సిగ్ పోటీలకి న్యాయ నిర్ణేతగా ఎన్.ఐ.ఎస్ కోచ్ జోగిపాటి వంశీ వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎం.సుధీర్ వర్మ, షేక్ అబ్దుల్లా, న్యూట్రిషన్ కోచ్ ఎల్.నాగరాజు, పీడీ డి.భవానీ, పీఈటీ, కోచ్‌లు జి.రాహుల్, హేమంత్,పెయ్యల చంటి తదితరులు పాల్గొన్నారు.






## ఎరువులు అందించాలని కలెక్టర్‌కు వినతి

**జలుమూరు, ఆగస్టు 25(వార్త):** శ్రీముఖలింగం గ్రామలో రైతులుకు ఎరువులు అందించాలని ఆ గ్రామ రైతులు మొజ్జడ రామారావు, గుంట కర్ణవీరుడు, పైడి రమణ తదితరులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం వారు శ్రీకాకుళంలో కలెక్టర్‌ను కలిసి తమ గ్రామ రైతుల సంతకాలతో కూడాన వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. ఎరువులపై వ్యవసాయ అధికారిని సంప్రదించగా నెల రోజులుగా వాయిదా వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. ఎరువులు వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశిచారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

## మట్టి వినాయక ప్రతిమల పంపిణీ




**ఇచ్ఛాపురం, ఆగస్టు 25(వార్త):** మట్టి గణపతి విగ్రహాలను పూజిస్తాం- పర్యావరణాన్ని కాపాడుకుందామని ఈదుపురం కాంద్ర వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉమా మహేశ్వరి అన్నారు. పాఠశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులతో ఆమె 100 మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించి, సోమవారం ఆ విగ్రహాలను పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి, సమీపంలో ఉన్న ఇళ్లకు ఉచితంగా అందజేశారు. మట్టి విగ్రహాలను పూజించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాస్కరపాడి, సబితకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటే కలలు సాకారం




**పలాస, ఆగస్టు 25(వార్త):** పట్టుదల ఉంటే కలలు సాకారం చేసుకోవచ్చుని, విద్యార్థులు కళాశాలకు మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా పట్టుదలతో కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శరత్‌బాబు, అధ్యాపకులు బి.వెంకటరావు, రామ్మోహన్ రావు, వాసుదేవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లపైకి వస్తే బంజరుదొడ్డికి పశువుల తరలింపు

**పలాస, ఆగస్టు 25(వార్త):** పశువులను యజమానులు రక్షించకపోతే బంజరు దొడ్డికి తరలిస్తామని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు హెచ్చరించారు. స్వీయ పరిరక్షణలో పశువులను ఉంచాలని, వాటి యజమానులకు పలుమార్లు నోటీసులను జారీ చేసి, సమవేశాలు నిర్వహించి కోరినప్పటికీ కూడా వారు బేఖాతరు చేయడంతో పట్టణ ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కాశీబుగ్గ, మేదర వీధి, పాత ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో "బంజరుదొడ్డి"ని సోమవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పశువులకు ఇబ్బందులు కలగకుండా నీటి కుండీలను, పశుగ్రాసాన్ని ఏర్పాటు చేసి, సంరక్షణకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించారు. బంజరుదొడ్డిలో కట్టిన పశువులకు మొదటిసారిగా రూ.500లు, రెండోసారి రూ.1000లు మూడోసారి రూ.2000లను జరిమానాగా విధిస్తామని కమిషనర్ తెలిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా సదరు పశువుల యజమానులపై మున్సిపల్ యాక్ట్, 1965 ప్రకారం కేసులు కూడా పెడతామన్నారు. ఇప్పటికైనా పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మెగా రక్తదాన శిబిరం

**హిరమండలం ఆగస్టు 25 (వార్త):**విశ్వబందోత్సవ దినోత్సవం సందర్భంగా సోమవారం హిరమండలం బ్రహ్మకుమారిల సేవా కేంద్రం ఇన్చార్జి బేబీ మోహిని ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆడపడుచులు, రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు ఈ కార్యక్రమంలో రాజమోహిని బ్రహ్మకుమారి సుధారాణి, లాడి భాస్కరరావు, మండల టిడిపి పట్టణ అధ్యక్షుడు డా.పోతిరెడ్డి శ్రీధర్, అందవరపు సురేష్, రెడ్ క్రాస్ సొసైటీ తరపున చైతన్య, రమణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546